క్లుప్తంగా

పాఠశాల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడుతో కూడిన బృందం గురువారం పరిశీలించింది. విద్యా ప్రమాణాలు, విద్యార్థుల సంఖ్య, ప్రస్తుత సిలబస్ పరిస్థితిని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్ల నిర్వహణ, ఇతర మౌలిక వసతులపై చర్చించారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. మెనూ అమలు చేయాలని, వంటగది, భోజనశాలల్లో పారిశుద్ధ్యం పాటించాలని హెచ్‌ఎం శ్రీరాములుకు సూచించారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

ఎచ్చెర్ల : లావేరు మండలం గురుగుబిల్లి పంచాయతీలో పల్లె పండుగలో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం సర్పంచ్ బి.కళ్యాణి, లక్ష్మణరావు భూమిపూజ చేశారు. రూ.పది లక్షల వ్యయంతో రోడ్డు నిర్మించనున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో జైలు శిక్ష

శ్రీకాకుళం రూరల్/శ్రీకాకుళం పాతబస్టాండ్: సింగుపురం గ్రామానికి చెందిన ఎస్.హటకేశం 2018లో తన ఇంటి మేడపై నిద్రిస్తుండగా గుర్తు తెలియని దుండగుడు ఇంట్లోకి చొరబడి 2 తులాల బంగారు ఆభరణాలు, 12 తులాల వెండి వస్తువులను దొంగిలించాడు. పొరుగునే ఉన్న సవలాపురపు శాంతమ్మ ఇంట్లో కూడా పావుతులం బంగారం చోరీకి గురైంది. ఈ కేసులకు సంబంధించి రాజాం మండలం గురువాం గ్రామానికి చెందిన కుప్పిలి సురేష్‌కు గురువారం జైలు శిక్ష విధించారు. అదే విధంగా, బైరి గ్రామానికి చెందిన ఇప్పిలి బాలకు చెందిన విసన కర్రల మిల్లులో 2022లో మోటార్లు, కటింగ్ మెషిన్, గుణపాం చోరీకి సంబంధించి గార మండలానికి చెందిన అడబాల గోపికృష్ణ, శేరు చిన్నారావు, బాసూరి కృష్ణారావు, పోలాకి మండలానికి చెందిన సతివాడ హరిలకు ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ ఒకటో అదనపు ఒకటో తరగతి మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు.

సాగునీటి కాలువ పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: నారాయణపురం కుడికాలువను జలవనరుల శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. లస్కర్లు, స్థానిక రైతుల సహకారంతో పూడికలు తొలగించారు. ఫరీదుపేట, ఇబ్రహింబాద్ పరిధిలో కాలువలో అడ్డులు తొలగించి శివారు ప్రాంతాలకు నీరు అందజేసే ప్రయత్నం చేశారు. జలవనరులు శాఖ అధికారి అప్పలరాజు, సిబ్బంది పర్యవేక్షించారు.

ధర్మపురికి సత్కారం



ధర్మపురి గౌరీశంకర శాస్త్రిని సత్కరిస్తున్న ఆలయ ధర్మకర్తలు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని అతిరుద్ర యాగకర్త, శతాధిక ప్రతిష్ఠాపన ఆచార్య ధర్మపురి గౌరీశంకర శాస్త్రిని గురువారం ఘనంగా సత్కరించారు. గోవిందనగర్ కాలనీలో వార్షిక ఉత్సవాలు పూర్తయిన సందర్భంగా ఆలయ ధర్మకర్తలు మొదలవలస ఉషారాణి, జగన్మోహనరావు దంపతులు, భక్తులు సత్కరించారు. కార్యక్రమంలో చరణ్‌శంకరశర్మ, తదితరులు పాల్గొన్నారు.

యువతకు దిక్సూచి రతన్ టాటా



మాట్లాడుతున్న డాక్టర్ బొడ్డేపల్లి సురేష్

శ్రీకాకుళం అర్బన్: నేటి యువతకు దిక్సూచి రతన్ టాటా అని శ్రీకాకుళం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ పేర్కొన్నారు. గురువారం సన్‌రైజ్ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కరోనా వ్యాప్తి వంటి కీలక సమయంలో టాటా దాతృత్వం అమోఘమన్నారు. కళింగ సంక్షేమ సేవా సంఘం జాతీయ గౌరవ అధ్యక్షులు బుడుమూరు శ్రీరామమూర్తి మాట్లాడుతూ సాటి మనుషులు, జీవుల పట్ల రతన్‌టాటా ఎంతో ప్రేమ కలిగి ఉండేవారని గుర్తు చేశారు. సమావేశంలో కె.జి.ఎఫ్.అధ్యక్షుడు బి.వి.ఎస్.ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏవోకు సత్కారం



సత్యశోభారాణిని సత్కరిస్తున్న ఎస్పీ, సిబ్బంది

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సహాయ పరిపాలనాధికారిణిగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల ఉద్యోగోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న జి.సత్యశోభారాణిని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి గురువారం సత్కరించారు. ఈమె విజయనగరం జిల్లా ఏపీఎస్పీ బెటాలియన్‌కు ఏవోగా వెళ్తున్నారు. కార్యక్రమంలో ప్రస్తుత ఏవో గోపినాథ్, కార్యాలయ సూపరింటెండెంట్లు కోటేశ్వరరావు, బాలరాజు, లిల్లీభాయ్, సిబ్బంది పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



దోమాం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. పక్కనే అంగన్‌వాడీ కేంద్రం ఉండటంతో చిన్నారులు ఇక్కడే ఆడుతుంటారు. పాత భవనం పెచ్చులు, ఇతర శిథిలాలు పడితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి భవనం తొలగింపునకు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. - ఎచ్చెర్ల క్యాంపస్

నడకయాతన



టంకాలదిగ్గువలస నుంచి నక్కపేట గ్రామానికి వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. మట్టి రోడ్డు కావడంతో ఎక్కడికక్కడ గోతులు ఏర్పడటంతో రాకపోకలకు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి రోడ్డు పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. -జి.సిగడాం

స్తంభాలతో సరి



ఎచ్చెర్లలో చేపట్టిన రైతు సేవా కేంద్రం భవనం నిర్మాణం స్తంభాల దశలోనే ఆగిపోయింది. పనులు ఆగిపోయి నెలలు కావస్తుండటంతో స్తంభాలకు వినియోగించిన ఐరన్ తుప్పు పట్టిపోయింది. రైతు సేవా కేంద్రం లేకపోవటంతో రైతులు సైతం ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు. - ఎచ్చెర్ల క్యాంపస్

రోడ్డుకు మోక్షమెప్పుడో?

సంతసీతారాంపురం నుంచి కొయ్యాం గ్రామానికి వెళ్లే రహదారి గోతులమయంగా మారింది. దీంతో ప్రయాణికులు రాకపోకలు సాగించలేక అవస్థలు పడుతున్నారు. చినుకుపడితే మరింత చిత్తడిగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - ఎచ్చెర్ల



సంపూర్ణ ఆరోగ్యానికి సిరిధాన్యాలు



చిరుధాన్యాలతో తయారైన ఉండలు, జంతికలు

- మిల్లెట్స్‌తో తయారైన తినుబండారాలకు గిరాకీ
- మార్కెట్లో జోరుగా అమ్మకాలు
- మహిళలకు ఉపాధి

శ్రీకాకుళం కల్చరల్: ప్రస్తుత యాంత్రీకరణ సమాజంలో ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా ఆహార పదార్థాల ఎంపికలు జాగ్రత్తలు వహిస్తున్నారు. బీపీ, షుగర్, ఊబకాయం వంటి దీర్ఘకాలిక సమస్యలు రాకుండా ముందస్తుగా అప్రమత్తమవుతున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యం మెరుగుపరుచుకునేందుకు చిరుధాన్యాల ఉత్పత్తులను తినాలని మెజారిటీ వైద్యులు సూచిస్తుండటంతో వాటితో తయారైన తినుబండారాలకు మార్కెట్లో గిరాకీ పెరిగింది. చిన్న పాన్ షాపు నుంచి పెద్దపెద్ద మార్ట్‌ల వరకు వీటిని ప్రత్యేకంగా అమ్ముతున్నారు. శ్రీకాకుళం నగరంలో భారీ ఎత్తున మిలెట్స్‌తో తయారైన తినుబండారాలు అమ్ముడుపోతున్నాయి.

అనేక రకాలు..

చిరుధాన్యాలతో తయారైన రవ్వదోశ పిండి, మిక్చర్, జంతికలు, చేగోడీలు, రాగి మురికీలు, శనగ ఉండలు, నువ్వుండలు ఎక్కువగా విక్రయిస్తున్నారు. వీటిని ఆర్డర్‌పై కూడా తయారు చేసి అందిస్తున్నారు. నగరంలోని కానుకుర్తివారి వీధి, న్యూకాలనీ తదితర ప్రాంతాల్లో ఇవి తయారవుతున్నాయి. చిరుధాన్యాలతో తిను బండారాలను తయారుచేసేందుకు ఆమదాలవలసలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.



మిల్లెట్‌తో తినుబండారాలు తయారు చేస్తూ..

ఇంటి వద్దనే తయారీ..



చిరుధాన్యాలతో ఇంటి వద్దనే తినుబండారాలు తయారు చేసి షాపులోనే అమ్ముతున్నాం. వీటితో పాటు దంపుడు బియ్యం, చిట్టి ముత్యాలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, గానుగ నూనెకు కూడా గిరాకీ ఉంటోంది.

– దార్లపూడి రవి, న్యూకాలనీ, శ్రీకాకుళం

నాణ్యతకు ప్రాధాన్యం



నాణ్యమైన సరుకులతో తినుబండారాలు తయారు చేస్తున్నాం. వీటిని తయారు చేసేందుకు కొంతమంది మహిళలకు కూడా ఉపాధి కల్పిస్తున్నాం. అందుబాటు ధరల్లో లభ్యం కావడంతో కొనుగోళ్లు బాగానే ఉంటున్నాయి.

– కృష్ణవేణి, శ్రీకాకుళం



● వానందం

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో గురువారం జిల్లా కేంద్రంలో మోస్తరు వర్షం కురిసింది. కొద్దిరోజులుగా ఉక్కపోతకు గురైన ప్రజలు తాజా జల్లులతో ఉపశమనం పొందారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ టీచర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: మున్సిపల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ జిల్లా కమిటీ నేతృత్వంలో గురువారం సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ టీచర్ల సమస్యలను పరిష్కాలని కోరుతున్నప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం తగదని యూటీఎఫ్ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 22వ తేదీన 24 గంటలపాటు ధర్నాకు దిగుతామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు చౌదరి రవీంద్ర, పొందూరు అప్పారావు, గొంటి గిరిధర్, జిల్లా కార్యదర్శి టి.భాస్కరరావు, ఎస్.స్వర్ణకుమారి, మున్సిపల్ విభాగం కన్వీనర్ పి.సూర్యప్రకాశరావు, అధ్యక్ష కార్యదర్శులు టి.సీతారాం, టి.వైకుంఠరావు, తాతారావు, కె.శాంతిప్రియ, మున్సిపల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వివరాలు అప్‌లోడ్ చేయాలి



సూచనలిస్తున్న డీఈవో తిరుమలచైతన్య

గార: పాఠశాలకు సంబంధించి నిర్దేశిత వివరాలను ప్రతిరోజూ ఆన్‌లైన్‌లో శతశాతం అప్‌లోడ్ చేయాలని డీఈవో ఎస్.తిరుమల చైతన్య స్పష్టం చేశారు. గురువారం గారలోని ఎమ్మార్సీని సందర్శించారు.

విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల సెలవులు, మధ్యాహ్న భోజనం వివరాలు, ఫొటోలు వంటి అంశాలను రోజు వారీ అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎస్.రామకృష్ణ, పి.వినోదిని పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరీ పౌర్ణమి వేడుకలు



ఎచ్చెర్ల క్యాంపస్:ఫరీదుపేటలో వేషధారణలు



శ్రీకాకుళం కల్చరల్: ఉమాజఠలేశ్వరస్వామి ఆలయంలో నందెన్న, గౌరమ్మలు



శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి పెద్దమందిరంలో మహిళల గౌరీపూర్ణిమ పూజలు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని ఫరీదుపేటలో గౌరీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. మూడో రోజు నిర్వాహకులు ప్రదర్శించిన వేషధారణలు ఆకట్టుకున్నాయి. కొత్తపేట, కేశవరావుపేట, ఎస్ఎంపురం, బొంతలకోడూరు తదితర గ్రామాల్లో పౌర్ణమి సందర్భంగా గౌరీదేవి, నందెన్నలకు ప్రత్యేక పూజలు చేశారు. కుంచాల కురమయ్యపేటలోని దేవీపీఠంలో పౌర్ణమి సందర్భంగా శ్రీచక్రాలు వద్ద మహిళలు కుంకమార్చనలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మహామేరువకు పూజలు చేశారు.

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉమాజఠలేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు అశ్వినీకుమార్, మహేష్ ఆధ్వర్యంలో నందెన్న, గౌరీదేవిలను ప్రతిష్ఠించారు. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని అర్చకులు తెలిపారు. సత్యసాయి పెద్దమందిరంలో ప్రకాష్‌రావు శర్మ ఆధ్వర్యంలో మహిళలు గౌరీదేవి పూజలు నిర్వహించి భక్తిగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో మందిర కన్వీనర్ మురళీకృష్ణ, భూలక్ష్మి, మీరాబాయి, నాగభూషణం, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

అమ్మవార్లకు అలంకరణ



పూజలందుకుంటున్న రాజరాజేశ్వరి దేవి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గోవిందనగర్ కాలనీలో రాజరాజేశ్వరి దేవి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షులు మొదలవలస ఉషారాణి ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. మధ్యాహ్నం 800మందికి అన్నదానం నిర్వహించారు. నక్కవీధిలోని ఉమాజఠలేశ్వర స్వామివారి ఆలయంలో గౌరీపౌర్ణమి సందర్భంగా ఉమాదేవిని శాకంబరిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

కళాశాలల్లో సమయపాలన తప్పనిసరి



కొయ్యాం కళాశాలలో అధ్యాపకులతో సమావేశమైన డీవీఈఓ తవిటినాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు, సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని ఇంటర్మీడియెట్ విద్య జిల్లా డీవీఈఓ శివ్వాల తవిటినాయుడు స్పష్టంచేశారు. గురువారం ఎచ్చెర్ల, కొయ్యాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. జూనియర్ కళాశాలల్లో కొత్తగా తీసుకొచ్చిన సంస్కరణలను విద్యార్థులకు వివరించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు కళాశాలల్లో క్లాసులు, సాయంత్రం 4 నుంచి 5 వరకు స్టడీ హవర్స్ జరుగుతాయని చెప్పారు. యూనిట్ టెస్టులు, త్రైమాసిక, అర్ధసంవత్సర, ప్రీపబ్లిక్ పరీక్షలకు సంబంధించి నేరుగా ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి ప్రశ్నపత్రం వస్తుందని తెలిపారు. నీట్, జేఈఈ మెయిన్స్, ఎంసెట్ వంటి పోటీపరీక్షలకు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. అపార్ పేరిట స్టూడెంట్ ఐడీ కార్డులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు పీవీఎల్ నారాయణ(ఎచ్చెర్ల), కీర్తి తవిటినాయుడు (కొయ్యాం), సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి రిమాండ్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని దమ్మలవీధిలో బుధవారం మధ్యాహ్నం పుక్కళ్ల రాము అనే యువకుడిని అదే వీధికి చెందిన తోట దుర్గాప్రసాద్ కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి దుర్గాప్రసాద్‌ను గురువారం అరెస్టు చేసి 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ పేర్కొన్నారు.

నవంబర్‌లో సీపీఎం జిల్లా మహాసభలు



మాట్లాడుతున్న గోవిందరావు, కృష్ణమూర్తి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సీపీఎం జిల్లా మహాసభలు పలాసలో నవంబర్ 9, 10 తేదీల్లో నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి తెలిపారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు, నిరుద్యోగం, జమిలి ఎన్నికల ఉప సంహరణ, మహిళలపై అత్యాచారాలు అరికట్టాలని కోరుతూ చేపట్టనున్న ప్రజాహోరును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

షిర్డీసాయికి విశేష పూజలు

శ్రీకాకుళం కల్చరల్ : బొందిలీపురంలోని సాయి దర్బార్‌లో గురువారం షిర్డీసాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎస్పీని కలిసిన అధికారులు



ఎస్పీని కలిసేందుకు వచ్చిన డీసీఆర్‌బీ ఎస్ఐ అమీర్ అలీ, కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు, అదనపు కమాండెంట్ సత్తిబాబు

శ్రీకాకుళం క్రైమ్ : ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని జిల్లా పోలీస్ కార్యాలయం ఏపీఎస్పీ మొదటి బెటాలియన్ అదనపు కమాండెంట్ పి.సత్తిబాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన ఇంటెలిజెన్సు విభాగంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈయనతో పాటు కాశీబుగ్గ రూరల్ సీఐ ఎం.తిరుపతిరావు, డీసీఆర్బీ ఎస్ఐ ఎం.డి.అమీర్ ఆలీ ఇటీవల విధుల్లో చేరడంతో ఎస్పీని కలిశారు.

ఆధ్యాత్మిక జ్ఞానప్రదాత వాల్మీకి



శ్రీకాకుళం న్యూకాలనీ: మాట్లాడుతున్న ప్రొఫెసర్ జి.ఎ.శర్మ

శ్రీకాకుళం క్రైమ్ : భారతదేశానికి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రసాదించిన గొప్ప వ్యక్తి వాల్మీకి మహర్షి అని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. ఆయన జీవితం, రచనలు, కావ్యాలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో భాగంగా వాల్మీకి చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రినాయుడు, ఏవో సీహెచ్ గోపీనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళంపాతబస్టాండ్: కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతి నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ ఎం.అప్పారావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి అనురాధ, డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ, ఆర్‌ఐఓ దుర్గారావు, గిరిజన సంక్షేమ శాఖ ఏటీడబ్ల్యూఓ శ్రీనివాసరావు, విద్యాశాఖ ఏడీ లియాఖత్ ఆలీఖాన్ పాల్గొన్నారు.



శ్రీకాకుళం న్యూకాలనీ: మాట్లాడుతున్న మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్ర

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషులు, మహిళా డిగ్రీ కళాశాలల్లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగు విభాగం, సంస్కృత విభాగాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, తెలుగువిభాగాధిపతి డాక్టర్ కె.జ్యోతిలక్ష్మి, ఆంధ్రా యూనివర్సిటీ విశ్రాంత సంస్కృత విభాగాధిపతి జి.ఎ.శర్మ తదితరులు పాల్గొన్నారు.